
ప్రజాశక్తి
శుక్రవారం 1 మార్చి 2024
5





## పురుషోత్తంనాయుడుకు పలువురు అభినందనలు

ప్రజాశక్తి - పాలకొండ



పురుషోత్తనాయుడ్ని అభినందిస్తున్న నాయకులు

ఎ వి ఎ న్ జి ఒ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా చౌదరి పురుషోత్తమ నాయుడు ఎంపిక కావడంతో విజయవాడలో జరిగిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు హనుమంతు సాయిరాంతో పాటు కార్యదర్శి శర్మ, పాలకొండ డివిజన్ నాయకులు లిల్లీ పుష్పనాథం, రంగాచారి, తదితరులు అభినందనలు తెలిపారు. కొంతకాలంగా ఈ ప్రాంతం నుంచి రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల పదవులు దక్కలేదని, ఈసారి పురుషోత్తమనాయుడుకు లభించడం సంతోషంగా ఉందని అన్నారు.

# నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

- ప్రథమ సంవత్సరం 5756 మంది
- ద్వితీయ సంవత్సరం 5700 మంది
- 32 కేంద్రాల్లో పరీక్షలు
- నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు



బెంచీలపై వేసిన హాల్‌టిక్కెట్ల నెంబర్లు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

ఇంటర్ పరీక్షలు మార్చి 1 తేదీ శుక్రవారం నుంచి జరుగనున్నాయి. ఇప్పటికే ఇంటర్ బోర్డు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లా వ్యాప్తంగా 32 కేంద్రాల్లో పరీక్షలు జరగనున్నాయి. ఫిబ్రవరి 5 తేదీ నుంచి జరిగిన ప్రాక్టికల్ పరీక్షలు పూర్తయ్యాయి. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద తాగునీరు, మరుగుదొడ్లు, మెడికల్ సిబ్బంది అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు సకాలంలో చేరుకొనేలా ఆర్టీసి బస్సులు అందుబాటులో ఉంటాయి. పరీక్ష సమయంలో ఎటువంటి విద్యుత్ అంతరాయం లేకుండా ఇప్పటికే ఆదేశాలు ఇచ్చారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరం రెగ్యులర్ 11456మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. వీరిలో ప్రథమ సంవత్సరం విద్యార్థులు 5756 మంది పరీక్ష రాయనుండగా, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 5700 మంది హాజరు కానున్నారు. వీరితో పాటు సప్లిమెంటరీ విభాగానికి చెందిన విద్యార్థులు 1744మంది పరీక్షలు రాయనున్నారు. అలాగే ఫస్ట్ ఇయిర్ ఒకేషనల్ 3674 మంది, సెకెండర్ ఇయర్ 3396మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. పరీక్షా కేంద్రాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేశారు. ఎటువంటి ఇబ్బందులూ లేకుండా, అవకతవకలు జరగకుండా నిఘా కెమెరాలు పెట్టారు.

**ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతి లేదు**

పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరగనున్నాయి. విద్యార్థులు ఉదయం 8.30 గంటలకే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి, 9 గంటలకు ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షకు అనుమతి లేదు.

**సెల్ ఫోన్లు అనుమతి లేదు**

పరీక్షలు రాసే అభ్యర్థులు, పరీక్షలు నిర్వహించే సిబ్బంది, ఇన్విజిలేటర్‌లు ఎవరూ పరీక్ష కేంద్రాలకు సెల్ ఫోన్లు తీసుకు వెళ్లేందుకు అనుమతి లేదు. కాలేజీలో పని చేసే సిబ్బంది కూడా సెల్ ఫోన్లు వినియోగించడానికి అనుమతి లేదు. అన్ని పరీక్ష కేంద్రాలు వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది. రెండు ఫ్లయింగ్ స్క్వాడ్లు, రెండు సిట్టింగ్ స్క్వాడ్ల పర్యవేక్షణలో పరీక్షలు జరగనున్నాయి.

### సర్వజన ఆసుపత్రిలో

# గిరిజన వైద్యానికి ప్రత్యేక విభాగం

- విద్యార్థుల వరుస మరణాలపై అధ్యయనానికి సిఫారసు
- ఎస్‌టి కమిషన్ ఛైర్మన్ డివిజి శంకరరావు
- సాలూరు రోడ్డు ప్రమాద బాధితులకు పరామర్శ



క్షతగాత్రులతో మాట్లాడుతున్న ఛైర్మన్ డిజివి శంకరరావు

ప్రజాశక్తి-విజయనగరం కోట

వైద్యం కోసం గిరిజనులు చేరిన వెంటనే వారికి మెరుగైన సత్వర సేవలు అందించేందుకు వీలుగా స్థానిక ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ఒక ప్రత్యేక సెల్ ఏర్పాటు చేసేలా ప్రభుత్వానికి సూచిస్తానని రాష్ట్ర ఎస్‌టి కమిషన్ ఛైర్మన్ డాక్టర్ డివిజి శంకరరావు చెప్పారు. ఈ సెల్ ఏర్పాటు ద్వారా ప్రత్యేక వైద్య(రెఫరల్) సేవలు పొందేందుకు వివిధ ప్రాంతాల నుంచి ఆసుపత్రికి వచ్చే గిరిజనులకు సత్వర వైద్యసేవలు అందడంతో పాటు వారికి అందించే వైద్యసేవలపై ప్రత్యేక శ్రద్ధ వహించే అవకాశం వుంటుందన్నారు. విశాఖపట్నంలోనూ, పార్వతీపురం ఆసుపత్రిలోనూ ఇటువంటి సెల్‌లు ఏర్పాటు చేశారని, వీటివల్ల మంచి ఫలితాలు వుంటున్నాయని చెప్పారు. సాలూరు మండలం విజయరాంపురం వద్ద ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో పెళ్లి వ్యాన్ బోల్తాపడిన ఘటనలో గాయపడి స్థానిక ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తొమ్మిది మంది గిరిజనులను ఎస్.టి.కమిషన్ ఛైర్మన్ గురువారం పరామర్శించారు. చికిత్స పొందుతున్న గిరిజనుల వద్దకు వెళ్లి వారికి అందుతున్న వైద్య సహాయం గురించి తెలుసుకోవడంతోపాటు అక్కడి వైద్యులతో మాట్లాడి ప్రమాద అత్యుత్తమ వైద్యసేవలు అందించాలని కోరారు.. బాధితులకు మరింత వైద్యసేవలు అందించేలా ఐటిడిఎ, ప్రభుత్వం నుంచి సహాయం అందిస్తామన్నారు.

అనంతరం ఎస్‌టి కమిషన్ ఛైర్మన్ మీడియాతో మాట్లాడుతూ పలు జిల్లాల్లో గిరిజన విద్యార్థుల మరణాలు ఇటీవలి కాలంలో వరుసగా సంభవిస్తున్నాయని, తాను కూడా పలు ప్రాంతాలను సందర్శించానని చెప్పారు. అయితే ఈ మరణాలన్నీ ఒకే కారణంతో జరగడం లేదని, వేర్వేరు కారణాలతో సంభవిస్తున్నట్టు తెలుస్తోందని చెప్పారు. గిరిజన విద్యార్థుల మరణాలకు కారణాలను తెలుసుకొని వాటిని భవిష్యత్తులో పునరావృతం కాకుండా నివారించేందుకు వైద్య నిపుణులు, విద్యా రంగ నిపుణులతో కమిటీ వేసి సమగ్ర అధ్యయనం జరిపించాలని ప్రభుత్వాన్ని కోరనున్నట్టు చెప్పారు. దీనివల్ల దీర్ఘకాలిక ఫలితాలు వుంటాయన్నారు. ఈ పర్యటనలో ఆర్ఎంఒ డాక్టర్ సురేష్, కమ్యూనిటీ మెడిసిన్ విభాగం హెచ్ఒడి డాక్టర్ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించి సంక్షేమ పథకాలు అమలు చేయాలని ఎపి భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం స్థానిక కలెక్టరేట్ ఎదురుగా రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మథరావు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులు సంక్షేమ బోర్డును సమర్థవంతంగా నిర్వహించాలని, కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని, సంక్షేమ బోర్డు నిధులు రూ.2వేల కోట్లు సంక్షేమ బోర్డుకు రాష్ట్ర ప్రభుత్వం జమ చేయాలని, అర్హులైన భవన నిర్మాణ కార్మికులకు పెన్షన్ సౌకర్యం పెండింగ్ క్లైములు పరిష్కరించాలని, ఇప్పటికే ఈ శ్రమ పోర్టల్‌లో నమోదు చేసుకున్న కార్మికులకు విశ్వకర్మ యోజన అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎపి భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రాయిపల్లి రాము మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలోనూ, సంక్షేమ బోర్డును సమర్థవంతంగా నిర్వహించడంలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నిర్లక్ష్యం చేస్తున్నారన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో పోరాడి సాధించుకున్న సంక్షేమ బోర్డు ద్వారా భవన నిర్మాణ కార్మికులకు అనేక సంక్షేమ పథకాల అమలయ్యేవని జగన్మోహన్ రెడ్డి తమ సంక్షేమం కోసం పని చేయాల్సిన ప్రభుత్వం ఆ పని చేయకుండా కార్మికులు సెస్ ద్వారా బోర్డులో ఉన్న రూ.2వేల కోట్లు ఇతర అవసరాలకు దారి మళ్లించి మా కార్మికుల సంక్షేమానికి తూట్లు పొడిచారని విమర్శించారు. సంక్షేమ బోర్డు ద్వారా అందాల్సిన సంక్షేమ కార్యక్రమాలు అందకుండా జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందన్నారు. మరో వైపు కరోనా కాలం నుంచి నేటి వరకు భవన నిర్మాణ కార్మికులకు పనులు కల్పించి, ఆదుకోవడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందన్నారు. 30 లక్షల మంది కార్మికుల జీవితాలతో రాష్ట్ర ప్రభుత్వం జిఒ 12,13 ను విడుదల చేసి పని లేకుండా చేసిందన్నారు. తమిళనాడు, కేరళ, ఇతర రాష్ట్రాల్లో భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ద్వారా అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నా మన రాష్ట్రంలో అమలు చేయకపోవడం దారుణమన్నారు. సంక్షేమ బోర్డు ను సమర్థవంతంగా నిర్వహించాలని, ఉపాధి కి నష్టం చేసే మెమో 12,13ను రద్దు చేయాలని, తమ డబ్బులు రూ.2వేల కోట్లు బోర్డుకు జమ చేసి, సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు కోశాధికారి గొర్లి వెంకటరమణ. బంకురు సూరిబాబు, నాయకులు రమేష్, అల్లం దుర్గారావు, శంకర్రావు, కుప్పిలి అప్పారావు, ఇ.వెంకటరమణ, వై.వాసు, ఆనంద్, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.



రిలే నిరాహారదీక్షలను ప్రారంభిస్తున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మన్మథరావు

**పాలకొండ** : భవన నిర్మాణ కార్మికులకు నష్టం చేకూర్చే 12, 13 మెమోను రద్దు చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం (సిఐటియు) ఆధ్వర్యంలో పాలకొండలో కార్మికులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు, భవన నిర్మాణ కార్మిక సంఘం పాలకొండ మండలం ప్రధాన కార్యదర్శి అర్థముడి లక్ష్మణరావు మాట్లాడుతూ వైసిపి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం కార్మికుల పట్ల చాలా నిర్లక్ష్యంగా ఉందని, బిల్డింగ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డులో ఉన్న కార్మికులకు ఎటువంటి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు కావడం లేదని, ఇది చాలా దుర్మార్గమైన చర్య అని అన్నారు. నాలుగేళ్లు పెండింగ్లో ఉన్న పరిహారాలను కార్మికులకు తక్షణమే చెల్లించాలని, కరోనా కారణంగా చనిపోయిన భవన నిర్మాణ కార్మికులకు రూ.10 లక్షలు చెల్లించాలని, వైసిపి ప్రభుత్వం పక్కదారి పట్టించిన కార్మికుల సెస్ నిధులు తిరిగి సంక్షేమ బోర్డుకు అప్పగించాలని, సిమెంటు, ఐరన్, ఇసుక ధరలు తగ్గించి నిర్మాణ కార్మికులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులు మల్లవరపు రమేష్, గార అప్పన్న, శేఖర్, నారాయణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

**కురుపాం** : భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి కట్టుబడిన పార్టీలకే రానున్న ఎన్నికల్లో ఓటు వేద్దామని భవన నిర్మాణ కార్మిక సంఘ జిల్లా అధ్యక్షులు కె.గౌరీశ్వరరావు సిఐటియు నాయకులు కె.అవినాష్ అన్నారు. గురువారం కురుపాంలో గల రావాడ జంక్షన్ కాంప్లెక్స్ వద్ద జరిగిన భవన నిర్మాణ కార్మికుల నిరసన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో 30 లక్షల మంది భవన నిర్మాణ కార్మికులకు అమలవుతున్న సంక్షేమ పథకాలు ప్రభుత్వ ఆపివేయడం విడ్డూరంగా ఉందన్నారు. భవన నిర్మాణ కార్మికుల ఓట్లు తమకు వద్దనుకున్నారో వారి నోట్లో మట్టి కొట్టిన తమకు ఓట్లు వేస్తారని ధీమాతో ఉన్నారో తెలియదు కాని పక్క రాష్ట్రం తెలంగాణలో ప్రమాద మరణానికి రూ.6 లక్షలు, సహజ మరణానికి రూ.2 లక్షలు, వివాహ కానుక, ప్రసవ కానుక, వత్తిపరమైన పనిముట్లు తదితర సంక్షేమ పథకాల అమలు చేస్తున్నారని అటువంటి పథకాలనే తమిళనాడు ,కర్ణాటక, కేరళతో సహా అన్ని రాష్ట్రాల్లో అమలవుతున్నాయని అన్నారు. కావున భవన నిర్మాణ సంక్షేమ బోర్డు ద్వారా సంక్షేమ పథకాల మాదిరిగా ప్రభుత్వం అమలు చేయాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో సిఐటియు ఎం.రవికుమార్, ఎ.అరుణ, బి.ఈశ్వరరావు, జి.జన భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.




పాలకొండలో నిరసన ర్యాలీ చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు



మహిళా మార్టును పరిశీలిస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

# మహిళా మార్ట్‌లు ప్రారంభించిన తొలి రాష్ట్రం

## ప్రారంభోత్సవంలో డిప్యూటీ సిఎం, మెప్మా డైరెక్టర్

ప్రజాశక్తి - సాలూరు

దేశంలో మహిళా మార్ట్‌లు ప్రారంభించిన తొలి రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ మాత్రమేనని డిప్యూటీ సిఎం రాజన్నదొర అన్నారు. పట్టణంలోని పాత మీసేవా కేంద్రంలో గురువారం జగనన్న మహిళా మార్ట్‌ను ఆయన మెప్మా మిషన్ డైరెక్టర్ విజయలక్ష్మితో కలిసి ప్రారంభించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ మహిళా సాధికారత లక్ష్యంగా సిఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలన్నీ మహిళల పేరిట అమలు చేస్తున్నారని చెప్పారు. అమ్మ ఒడి, చేయూత, చేదోడులాంటి సంక్షేమ పథకాలను మహిళలకు అందజేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో ఇది 12వ మహిళా మార్ట్ అని చెప్పారు. బహుళ జాతి కంపెనీలతో ఒప్పందం చేసుకుని నాణ్యత, నవ్యత కలిగిన నిత్యావసర వస్తువులను తక్కువ ధరకు విక్రయించాలని నిర్ణయించినట్లు చెప్పారు. మెప్మా మిషన్ డైరెక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్రంలో సిఎం జగన్‌మోహన్‌రెడ్డి వినూత్న ఆలోచనలకు ప్రతిరూపమే మహిళా మార్ట్‌ల ఏర్పాటు అని చెప్పారు. ఇంతవరకు ఏర్పాటు చేసిన మహిళా మార్ట్‌లన్నీ దిగ్విజయంగా నడుస్తున్నాయని, లాభాల బాటలో ఉన్నాయని చెప్పారు. మహిళా మార్ట్‌ల టర్నోవర్ రూ.58 కోట్లు అని అన్నారు. వచ్చిన లాభాల సొమ్ముతో తిరుపతి, శ్రీకాకుళం పట్టణాల్లో రెండో యూనిట్ ప్రారంభించినట్లు తెలిపారు. సాలూరులో రూ.19లక్షల పెట్టుబడితో మార్ట్‌ను ప్రారంభించినట్లు చెప్పారు. పట్టణ ప్రగతి యూనిట్లు తయారు చేసిన ఉత్పత్తులతో పాటు ఇతర డిమాండ్ ఉన్న వస్తువులన్నీ మార్ట్‌లో అందుబాటులో ఉంటాయని చెప్పారు. మహిళా సంఘాల సభ్యుల ఆర్థిక స్వావలంబన ధ్యేయంగా ప్రభుత్వం మార్ట్‌ల రూపకల్పన చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ పువ్వుల ఈశ్వరమ్మ, వైస్ ఛైర్మన్ లు జర్జాపు దీప్తి, వంగపండు అప్పలనాయుడు, మెప్మా పిడి సుధాకర్ రావు,కమిషనర్ ప్రసన్న వాణి, అర్బన్ బ్యాంక్ అధ్యక్షులు జర్జాపు ఈశ్వరరావు, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి జర్జాపు సూరిబాబు, జెసిఎస్ కన్వీనర్ గిరిరఘు, కౌన్సిలర్లు గొర్లి వెంకటరమణ, రాపాక మాధవరావు, పప్పల లక్ష్మణరావు, సిఎంఎం ఎ.పుష్ప, మాజీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# నిధులు వృథా చేస్తారా?

## మున్సిపల్ సమావేశంలో కౌన్సిలర్లు గరంగరం



వాగ్వివాదం చేసుకుంటున్న కౌన్సిలర్లు, ఛైర్‌పర్సన్

ప్రజాశక్తి - సాలూరు


మున్సిపాలిటీలో అత్యవసరం కాని పనులకు సాధారణ నిధులు ఎలా ఖర్చు చేస్తారని పలువురు కౌన్సిలర్లు ధ్వజమెత్తారు. గురువారం మున్సిపల్ ఛైర్‌పర్సన్ పువ్వుల ఈశ్వరమ్మ అధ్యక్షతన జరిగిన సాధారణ సమావేశంలో అధికారపార్టీ సభ్యులు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మురికివాడల్లో కనీస అవసరాలు తీర్చడానికి నిధుల్లేవని చెపుతున్న అధికారులు పనికిమాలిన పనుల కోసం లక్షలు ఎలా ఖర్చు చేస్తారని వైసిపి కౌన్సిలర్లు నిలదీశారు. తన వార్డు బంగారమ్మపేటలో వీధి దీపాలు వెలగడం లేదని, తాగునీటి సరఫరా జరగడంలేదని కొన్నేళ్లుగా మొత్తుకుంటున్నా పట్టించుకోని అధికారులు రూ.11.5లక్షలతో పారిశుధ్య నిర్వహణ వాహనాలకు నీడ్ కోసం షెడ్ ఎలా నిర్మిస్తారని కౌన్సిలర్ సింగారపు ఈశ్వరరావు ప్రశ్నించారు. 11వ వార్డు చినహరిజనపేటలో రూ.50వేలు ఖర్చు చేస్తే చిన్న చిన్న సమస్యలు పరిష్కారమవుతాయని, వాటికి నిధుల్లేవని చెపుతున్న అధికారులు ఇప్పుడెలా లక్షలు ఖర్చు చేస్తున్నారని కౌన్సిలర్ లింగాల దుర్గా ప్రశ్నించారు. కౌన్సిలర్లు గిరిరఘు, గొర్లి వెంకటరమణ, రాపాక మాధవరావు, బి.శ్రీనివాసరావు, పప్పల లక్ష్మణరావు మాట్లాడుతూ రేకుల షెడ్ కోసం రూ.11.5లక్షలు సాధారణ నిధులు ఎలా ఖర్చు చేస్తారని నిలదీశారు. వీరి వాదనకు వైస్ ఛైర్మన్ వంగపండు అప్పలనాయుడు, జర్జాపు దీప్తి మద్దతు పలికారు. పారిశుధ్య విభాగంలో ఆరుగురు డ్రైవర్లు ఉండగా మళ్లీ డ్రైవర్ అవసరం ఎందుకు వచ్చిందని కౌన్సిలర్లు గిరిరఘు, గొర్లి వెంకటరమణ, రాపాక మాధవరావు ప్రశ్నించారు. అసలే నిధుల కొరతతో సతమతమవుతున్న మున్సిపాలిటీపై ఆర్థిక భారంపడేలా అధికారుల చర్యలు వున్నాయని చెప్పారు. జెసిబిని నడపడానికి అనుభవం వున్న డ్రైవర్ అవసరమని శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ ఫకీర్ రాజు చెప్పారు. తనను శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ తప్పుతోవ పట్టించారని ఛైర్ పర్సన్ పువ్వుల ఈశ్వరమ్మ అన్నారు. జెసిబి నడిపేందుకు నైపుణ్యం ఉన్న డ్రైవర్ కావాలని చెప్పారని తెలిపారు. మున్సిపాలిటీలో పన్నుల వసూలుకు కొంతమంది కౌన్సిలర్లు అడ్డు పడుతున్నారని ఆమె అన్నారు. వాహనాలు నిలుపుదల కోసం రేకులు షెడ్, జెసిబి నడపడానికి డ్రైవర్ నియామకం అంశాలను సభ్యులు ఆమోదించలేదు. దీంతో వైసిపి కౌన్సిలర్లు, ఛైర్‌పర్సన్ పువ్వుల ఈశ్వరమ్మ మధ్య నెలకొన్న అంతర్గత విబేధాలు మరోసారి వెలుగులోకి వచ్చాయి. సమావేశంలో కమిషనర్ ప్రసన్నవాణి, ఎఇ సూరినాయుడు పాల్గొన్నారు.

## 98,991 మందికి పల్స్ పోలియో

ప్రజాశక్తి - పాలకొండ

పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా 98,991 మందికి పోలియో చుక్కలు వేయనున్నట్టు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బగాది జగన్నాథరావు తెలిపారు. మండలంలోని అన్నవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆకస్మికంగా సందర్శించి పల్స్ పోలియో కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. పోలియో వ్యాక్సిన్, కోల్డ్ చైన్ సిస్టమ్‌ను, వ్యాక్సిన్ కేరియర్లను తనిఖీ చేశారు. జిల్లాలో 42 మొబైల్ టీమ్‌లు, 19 ట్రాన్సిట్ టీమ్‌లు, 905 బూత్‌లు ఏర్పాటు చేశామన్నారు. ఐదేళ్లలోపు గల 98,991 పిల్లలకు పోలియో చుక్కలు వేసేందుకు అన్ని చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. ప్రతి ఆరోగ్య కేంద్రానికి సరిపడా వ్యాక్సిన్, ప్రచార, ఇతర సామగ్రి పంపిణీ చేశామన్నారు. ఈనెల 3న పల్స్‌పోలియో కార్యక్రమం జరుగుతుందన్నారు. ఐదేళ్లలోపు గల పిల్లల తల్లిదండ్రులు సమీపంలో ఉన్న పల్స్ పోలియో కేంద్రానికి వెళ్లి వ్యాక్సిన్‌ను వినియోగించుకోవాలని ఆయన అన్నారు. హైరిస్క్ ఏరియాపై ప్రత్యేక పర్యవేక్షణ ఉండాలని సిబ్బందిని ఆదేశించారు.

**వీరఘట్టం** : రెండు చుక్కలు నిండి జీవితానికి ఎంతో మేలు చేకూరుతుందని ఆ గ్రామాల్లో పల్స్ పోలియోపై అవగాహన కల్పించాలని స్థానిక వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి సిబ్బందిని ఆదేశించారు. గురువారం స్థానిక ఆరోగ్య సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. 0.5 ఏళ్లలోపు పిల్లలంతా తప్పనిసరిగా పోలియో చుక్కలు వేసుకునేలా చర్యలు చేపట్టాలని ఆమె ఆదేశించారు. జాతీయ పల్స్ పోలియో కార్యక్రమంపై గ్రామాల్లో ర్యాలీ నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో సూపర్వైజర్ ఒ.శాంతి కుమారి, ఎఎంఎం, ఎంఎల్‌హెచ్‌పి, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిని అందజేస్తున్న సిఐటియు నాయకులు, డ్రైవర్లు

# ఆప్కాస్‌లో డ్రైవర్లను చేర్చాలి

ప్రజాశక్తి-పార్వతీపురంటౌన్

స్థానిక మున్సిపల్ ప్రజారోగ్య విభాగంలో ఔట్సోర్సింగ్ ప్రాతిపదికన 15ఏళ్లుగా డ్రైవర్లుగా విధులు నిర్వహిస్తున్న కార్మికులకు 279 జీవో ప్రకారంగా జీతాలు ఇవ్వాలని సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ, మున్సిపల్ డ్రైవర్లు పి.గాంధీ, బి.సంతోష్ కుమార్, కె.వెంకటరావు, పి.వరదరాజు, ఎస్.శ్రీరాములు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ నిశాంత్ కుమార్‌కు సిఐటియు నాయకులు, మున్సిపల్ డ్రైవర్లు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మున్సిపాల్టీలో డ్రైవర్లుగా చేరినప్పటి నుంచి 2018 జూన్ వరకు మాత్రమే తమ నైపుణ్యానికి తగ్గట్టు జీతాలు చెల్లించే వారని, ఆప్కాస్ 279 జీవో అమలు ద్వారా తమకు ఎటువంటి జీతాల పెంపుదల్లేవని అన్నారు. ఈ సమస్యకే చాలాసార్లు సంబంధిత పై అధికారులకు విన్నవించుకున్నా ఫలితం లేకుండా పోయిందని తెలిపారు. ప్రజారోగ్య విభాగంలో ఉన్న ఔట్సోర్సింగ్ డ్రైవర్లను కూడా చేర్పించాలని ఉన్నప్పటికీ నేటికీ అటువంటి ప్రక్రియ మున్సిపాలిటీ సంబంధిత అధికారులు చేపట్టడం లేదని విన్నవించారు. ఈ విధానం రాష్ట్రవ్యాప్తంగా అనేక మున్సిపాలిటీల్లో అమలవుతున్నా కేవలం ఈ జిల్లా మున్సిపాలిటీల్లో మాత్రమే అమలు కాలేదన్నారు. పెరుగుతున్న ధరలు, ఆర్థిక పరిస్థితుల వల్ల చాలీచాలని వేతనంతో కుటుంబాన్ని పోషించడం చాలా కష్టంగా మారిందన్నారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి ప్రజారోగ్య విభాగంలో ఔట్సోర్సింగ్‌గా పనిచేస్తున్న తమను ఆప్కాస్‌లో డ్రైవర్లుగా నమోదు చేసి, తమ నైపుణ్యానికి తగిన జీతాలు పెంచాలని కోరారు



ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న ఇఇ వివి కిశోర్, తదితరులు

## వేసవిలో కోతల్లేని విద్యుత్ సరఫరా

ప్రజాశక్తి- సాలూరు

వేసవి కాలంలో కోతల్లేని విద్యుత్ సరఫరా చేయడానికి చర్యలు తీసుకున్నట్లు విద్యుత్ శాఖ ఇఇ వివి కిశోర్ చెప్పారు. గురువారం ఆయన దేవు బుచ్చింపేటలో వున్న 132/33 కెవి సబ్ స్టేషన్‌లో తక్కువ సామర్థ్యం 10/16 పవర్ వున్న ట్రాన్స్ ఫార్మర్ స్థానంలో 31.5 ఎంవిఎ పవర్ ట్రాన్స్ ఫార్మర్‌ని అమర్చి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.5కోట్ల వ్యయంతో ట్రాన్స్ ఫార్మర్‌ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దీని వల్ల సాలూరు, పాచిపెంట, మక్కువ మండలాలలో వున్న సబ్ స్టేషన్‌లకు మెరుగైన విద్యుత్ సరఫరా జరుగుతుందన్నారు. వేసవి కాలంలో గృహ వినియోగదారులకు, వ్యవసాయ పంపు సెట్లకు అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయనున్నట్లు తెలిపారు. మన్యం జిల్లా ఎస్ఇ లక్ష్మణరావు ఆదేశాల మేరకు చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ఆయన వెంట ఎడిఇ రంగారావు వున్నారు.



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఇంఛార్జి జెసి విష్ణుచరణ్

## వారం రోజుల్లోగా పనులు పూర్తి చేయాలి

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోని కేసలి పోలింగ్ కేంద్రాన్ని గురువారం ఇన్‌ఛార్జి జాయింట్ కలెక్టర్ జెసి విష్ణు చరణ్ పరిశీలించారు. పోలింగ్ కేంద్రం మరమ్మతు పనులను పరిశీలిస్తూ మిగిలిన పనులను త్వరతగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మరమ్మతు పనులకు అవసరమైన నిధులను కలెక్టర్‌తో చర్చించి నిధులు చెల్లిస్తామన్నారు. అలాగే పాఠశాల నిధులుపై ఎంఇఒ జోగారావును ప్రశ్నించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులను సంప్రదించి నివేదిస్తానని తెలిపారు. ఎన్నికల నిర్వహణకు హాజరైన సిబ్బందికి ఎటువంటి అసౌకర్యాలు లేకుండా చూడాలని సూచించారు. ఆయన వెంట తహశీల్దార్ పి.బాల, డిప్యూటీ తహశీల్దార్ ఎం రాజశేఖర్ పాల్గొన్నారు.



ల్యాబ్‌ను పరిశీలిస్తున్న శిక్షణ కలెక్టర్ రాఘువేంద్ర మీనా

## ఆశ్రమ పాఠశాల సందర్శన

ప్రజాశక్తి - సీతంపేట

శ్రీకాకుళం జిల్లా శిక్షణ కలక్టర్‌గా నియమితులైన రాఘువేంద్ర మీనా గురువారం సీతంపేట ఐటిడిఎలో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక ఐటిడిఎ కార్యాలయంలోని పలు విభాగాలను పరిశీలించి, వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సీతంపేట బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. 9వ తరగతి విద్యార్థులు ట్యాబ్ ఉపయోగించే విధానాన్ని పరిశీలించారు. అటల్ టింకరింగ్ ల్యాబ్‌ను పరిశీలించి, పనితీరును ప్రశంసించారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ త్వరలో రాయబోతున్న పబ్లిక్ పరీక్షలను బాగా రాయాలని సూచించారు. కార్యక్రమంలో ఎపిఒ రోసిరెడ్డి, డిడి అన్నాదొర, డిప్యూటీ డిఇఒ లిల్లీరాణి, ఎటిడబ్ల్యుఒ మంగవేణి, ఎఎంఒ కోటిబాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్‌జెడి శోభారాణి

## విజ్ఞాన రంగంపై విద్యార్థులు దృష్టి పెట్టాలి : ఆర్‌జెడి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

విజ్ఞాన రంగంలో రోజురోజుకు కొత్త కొత్త అన్వేషణలు జరుగుతున్న తరుణంలో విద్యార్థులు విజ్ఞాన శాస్త్ర రంగం అంశంపై దృష్టి సారించి జాగ్రత్తగా పరిశీలించుకోవాలని డిగ్రీ కళాశాల రీజనల్ జాయింట్ డైరెక్టర్ (రాజమహేంద్రవరం) ఎస్.శోభారాణి అన్నారు. స్థానిక డిగ్రీ కళాశాలను బుధవారం సందర్శించిన ఆమె విద్యార్థులతో మాట్లాడారు. జాతీయ విజ్ఞాన శాస్త్ర దినోత్సవం సందర్భంగా విద్యార్థులు తయారుచేసిన ప్రయోగాలను పరిశీలించారు. వీరి ప్రయోగాలకు పలు ప్రశ్నలు వేసి వారి వద్ద నుండి సమాధానం రాబట్టి సంతృప్తి చెంది సలహాలు సూచనలు ఇచ్చారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణ, నిబద్ధత తో చదివి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని, ఉన్నత లక్ష్యాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ శ్రీవరం, ఎన్ఎస్ఎస్ పిఒలు రామయ్య, త్రినాధ ఉన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-పాలకొండ

పట్టణంలో 132 కెవి విద్యుత్ ఉప కేంద్రం పరిధిలో నిర్వహణ పనుల నిమిత్తం శుక్రవారం మధ్యాహ్నం 12.30 గంటల నుండి సాయంత్రం 5.30 వరకు పట్టణంలో, తంపటపల్లి, మంగలాపురం, గోపాలపురం, బాసురు, బుక్కురు, కొండాపురం, అంపిలి, వెలగవాడ, లంబురు, నవగం, పొట్లీ, అవలింగి, ఎం.సింగుపురం తదితర గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని వినియోగదారులు సహకరించాలని ఈఈ టిజికె మూర్తి తెలిపారు

## సిఎం సహాయ నిధి రూ.10లక్షలు అందజేత

ప్రజాశక్తి- పాలకొండ

పట్టణంలో నాల్గవ వార్డ్ పరిధిలో టీచర్స్ కాలనీకి చెందిన కొట్టిశ జగన్మోహన్ అనారోగ్యంతో బాధపడుతున్న కారణంగా ఆయన వైద్య ఖర్చుల నిమిత్తం ఎమ్మెల్సీ విక్రాంత్ సిఫార్సు మేరకు సీఎం సహాయనిధి నుండి రూ.10లక్షలు విడుదల చేశారు. గురువారం ఈ మొత్తాన్ని జగన్మోహన్ ఇంటి వద్ద విక్రాంత్ ఆయనకు అందించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి ఇందుమతి, వీరఘట్టం ఎంపిపి దమలపాటి వెంకటరమణ, పాలవలస దవళేశ్వరరావు, నాల్గవ వార్డ్ కౌన్సిలర్ గంగు నాయుడు తదితరులు పాల్గొన్నారు.



బాధితునికి చెక్కును అందిస్తున్న నాయకులు

# టిడిపిని నమ్మితే నట్టేట మునిగిపోతారు : రాజన్నదొర

ప్రజాశక్తి- సాలూరు

టిడిపి, జనసేన నాయకుల మాటలు నమ్మితే నట్టేట మునిగిపోతారని డిప్యూటీ సీఎం రాజన్నదొర అన్నారు. గురువారం మున్సిపల్ కార్యాలయం ఆవరణలో మండలంలోని పేదలు సాగు చేస్తున్న భూములకు పట్టాలు పంపిణీ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ 14 ఏళ్ళు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు నాయుడు రాష్ట్రానికి ఏమీ చేయలేదని, వెనుకబడిన సాలూరు నియోజకవర్గానికి చేసిందేమీ లేదని అన్నారు. ఆరేళ్ళు ఎమ్మెల్సీగా వున్న సంధ్యారాణి నియోజకవర్గ అభివృద్ధికి ఏమి చేశారని ప్రశ్నించారు. నియోజకవర్గంలో వైసిపి ప్రభుత్వం నిర్మించిన రోడ్లమీదనే వెళుతూ అభివృద్ధి పనులు ఏమీ లేవని టిడిపి నాయకులు విమర్శిస్తున్నారని ఆరోపించారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్ మోసపూరిత హామీలతో మళ్ళీ ప్రజల ముందుకు వస్తున్నారని, వారి మాటలు నమ్మితే పేదలు నష్టపోతారని అన్నారు. మండలంలోని 492మందికి 446 ఎకరాల భూములు పంపిణీ చేశారు.

**ధర్నాలు చేస్తే ఏమీ రావట!**

సమస్యలు పరిష్కారం కోసం ధర్నాలు, నిరసనలు చేస్తే పరిష్కారం కావని రాజన్నదొర సెలవిచ్చారు. మెంటాడ మండలంలో సిపిఎం, గిరిజన సంఘం నాయకుల నుద్దేశించి ఇక్కడ మాట్లాడారు. ఎస్‌సి, ఎస్‌టిల మధ్య గొడవలు సృష్టించాలని కొన్ని సంఘాలు ప్రయత్నిస్తున్నా యని చెప్పుకొచ్చారు.



డిప్యూటీ సిఎంకు వినతినిస్తున్న ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు

ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్ పర్సన్ రెడ్డి పద్మావతి, వైస్ ఎంపిపి రెడ్డి సురేష్, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి దండి శ్రీనివాసరావు, జెసిఎస్ కన్వీనర్ కళ్లేపల్లి త్రినాథ్ నాయుడు, తహశీల్దార్ ఆనంద్ కుమార్, ఎంపిడిఒ ఫణీంద్ర కుమార్, సేవాదళ్ జిల్లా కార్యదర్శి సువ్వాడ రామకృష్ణ పాల్గొన్నారు.

**గిరిజనుల హామీలు అమలు చేయాలి**

**సాలూరు రూరల్:** గిరిజనులకు ఇచ్చిన హామీని అమలయ్యే విధంగా చూడాలని ఆదివాసీ గిరిజన సంఘం, వ్యవసాయకార్మిక సంఘం నాయకులు డిప్యూటీ సిఎం రాజన్నదొరను కోరారు. గిరిజనలకు పట్టాలు మంజూరు చేయాలని గత కొంత కాలంగా తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నాలు చేస్తున్నామని స్పందించిన తహశీల్దార్ మార్చి 10వ తారీకు లోపల పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చారని ఆ హామీని అమలు అయ్యేటట్టు చూడాలని డిప్యూటీ సిఎంను కోరారు. ఈ సందర్భంగా నాయకులు వంతెల సుందర రావు, గమ్మెల గాసి ఆయనకు వినతి పత్రాన్ని అందించారు. వారు మాట్లాడుతూ బొర్ర పణుకు వలస, జిల్లేడు వలస గిరిజనులకు ఇచ్చిన హామీ ప్రకారం సాగులో ఉన్నవారికి పట్టాలు వెంటనే పంపిణీ చేయాలని గిరిజనుల మధ్య తగాదాలు పెట్టిన తహశీల్దార్ బాలమురళీకృష్ణ, విఆర్ఒ కృష్ణమూర్తిపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలనీ కోరారు. మండలంలో సర్వేలు చేసిన వారందరికీ పట్టాలు వెంటనే పంపిని చేయాలని డిమాండ్ చేశారు. మండలంలో అటవీ పట్టాలు డీ పట్టాలు పంపిణీ చేస్తామని సర్వేలు చేశారు కానీ ఇంతవరకు పట్టాలు పంపిణీ చేయలేదని వెంటనే పట్టాలు పంపిణీ చేయాలని కోరారు. ఈ సందర్భంగా రాజన్నదొర మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం వచ్చిన తరువాత గిరిజనులు సాగు చేస్తున్న భూములకు పట్టాలను మంజూరు చేశామని మిగతా వాటికి కూడా ఇస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం మండల నాయకులు కూనేటి చినబాబు, పొట్టి రాము, బోయిన లక్ష్మణరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## గిరిజన సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని కేదారిపురం పంచాయతీలో గురువారం శంఖారావం సూపర్ సిక్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కురుపాం నియోజకవర్గ టిడిపి, జనసేన ఉమ్మడి అభ్యర్థి తోయక జగదీశ్వరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె ఆధ్వర్యంలో వైసిపి నుండి 10 కుటుంబాలు టిడిపిలోకి చేరాయి. అనంతరం ఎమ్మెల్యే అభ్యర్థి జగదీశ్వరి మాట్లాడుతూ టిడిపి అధికారంలోకి వచ్చాక గిరిజనుల సమస్యలు పూర్తిగా పరిష్కరిస్తానని ఆమె హామీ ఇచ్చారు. యువతకు ఉపాధి కల్పిస్తామని ఈ సందర్భంగా తెలిపారు. రాబోయేది తెలుగుదేశం - జనసేన ఉమ్మడి ప్రభుత్వమని, ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ప్రతి రైతుకు రూ.20వేల ఆర్థిక సాయం చేస్తామని అన్నారు. 18ఏళ్ల నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1500 అందిస్తామని, ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుకుంటే అంతమందికి రూ.15 వేలు ఇస్తామని, ప్రతి ఇంటికి ఏడాదికి 3గ్యాస్ సిలిండర్లు

ఎమ్మెల్యే అభ్యర్థి జగదీశ్వరి



మాట్లాడుతున్న జగదీశ్వరి

ఉచితంగా ఇస్తామని, ప్రతి మహిళకి ఆర్టీసీలో బస్సు ఉచిత ప్రయాణం కల్పిస్తామని తెలిపారు. అలాగే ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పన చేస్తామని, మూడు వేల రూపాయలు నెలకు నిరుద్యోగ భతి ఇస్తామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో మండల టిడిపి కన్వీనర్ పాడి సుదర్శన్‌రావు, ప్రధాన కార్యదర్శి పోలూరు శ్రీనివాసరావు, క్లస్టర్ ఇన్చార్జి కద్రక వెంకట్రావు, యూనిట్ ఇంచార్జ్ భుజ్జేశ్వరరావు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : తాడేపల్లిగూడెం సభను చూసి తాడేపల్లి ప్యాలస్ దద్దరిల్లిందని కురుపాం టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి తోయక జగదీశ్వరి అన్నారు. వైసిపి దొంగలకు వ్యతిరేకంగా టిడిపి, జనసేన పోరాడుతున్నాయన్నారు. గురువారం గుమ్మలక్ష్మీపురంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. బుధవారం జరిగిన టిడిపి, జనసేన తాడేపల్లిగూడెం సభను చూసి తాడేపల్లి ప్యాలస్ దద్దరిల్లిందని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికలు రాష్ట్రానికి అత్యంత కీలకమన్నారు. టిడిపి, జనసేన చేతులు కలిపింది తమ వ్యక్తిగత ప్రయోజనం, అధికారం కోసం కాదని, ఐదు కోట్ల రాష్ట్ర ప్రజల భవిష్యత్తు కోసం అని అన్నారు. ప్రజల జీవితాల్లో వెలుగులు నింపిందికే కూటమి అన్నారు. జాబ్ క్యాలెండర్ ఎక్కడ, డిఎస్‌సి ఎక్కడ, ఉచిత ఇసుక ఎక్కడఅని ప్రశ్నించారు. రాష్ట్ర పునర్నిర్మాణానికి ప్రజలుచేతులు కలపాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ పాడి సుదర్శన్ రావు, కార్యదర్శి పోలూరు శ్రీనివాసరావు ఉన్నారు.

## సేవలే గుర్తింపునిస్తాయి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్



సూర్యారావును సత్కరిస్తున్న ఉద్యోగులు

ఉద్యోగి విధి నిర్వహణలో చేసిన సేవలే గుర్తింపు నిస్తాయని జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి లోచర్ల రమేష్ అన్నారు. జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహించి పదవీ విరమణ చేసిన ఇ.సూర్యారావుకు గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వీసులో చేరిన ప్రతీ ఒక్క ఉద్యోగికి బదిలీలు, పదవీ విరమణ సాధారణమన్నారు. పని తనంతో ప్రదర్శించిన సేవలే చిర స్థాయిగా నిలుస్తాయని అన్నారు. క్రమ శిక్షణతో విధుల్లో ఆయన చూపిన నిబద్ధత, అంకిత భావం అందరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అధికారుల పట్ల వినయ విధేయతలతో మెలిగేవారని కొనియాడారు. అనంతరం సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి చేతుల మీదుగా జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టిఒ పి.గణేష్ బాబు, సహాయ కార్యనిర్వాహక సమాచార ఇంజినీర్ ఎమ్.గజపతిరావు, సహాయ ఇంజినీర్ సి.హెచ్. శ్రీనివాసరావు, జూనియర్ అసిస్టెంట్ సుజాత, సిబ్బంది, పాల్గొన్నారు

## గ్రామీణులకు చేరువలో ప్రభుత్వ సేవలు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

వైసిపి ప్రభుత్వం తీసుకువచ్చిన సచివాలయ వ్యవస్థ ద్వారా పంచాయతీలలో లక్షలాది రూపాయలు విలువగల ఆధునిక భవనాలు ఏర్పాటుతో పాటుగా గ్రామీణులకు ప్రభుత్వ సేవలు చేరువ య్యాయని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. గురువారం మండలంలోని పుట్టూరు గ్రామంలో రూ.43 లక్షలతో నిర్మించిన సచివాలయం భవనాలను ఆయన ప్రారంభించారు. అనంతరం గ్రామంలో జరిగిన సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ నవరత్నాల అమలు వల్ల పేదల జీవితాలలో గణనీయ మైన మార్పు వచ్చిందని, ఆర్థికంగా సగటు పేద ప్రజలకు ఎంతో మేలు కలిగించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ అకిబ్జా జావేద్, ఎంపిపి మజ్జి శోభారాణి,



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

జెడ్‌పిటిసి బలగ రేవతమ్మ, సర్పంచ్ గుంట్రెడ్డి సతీష్, ఎంపిటిసి ఏగిరెడ్డి లక్ష్మి, వైస్ ఎంపిపి బంకురు రవికుమార్, నాయకులు మజ్జి చంద్రశేఖర్, బలగ నాగేశ్వరరావు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు గ్రామస్తులు పాల్గొన్నారు.

## సబ్ సెంటర్ సందర్శన

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని పెదంకల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల కోట సీతారాంపురం ఆరోగ్య ఉప కేంద్రాన్ని పార్వతీపురం వైద్య ఆరోగ్యశాఖ ట్రాన్స్‌ఫోర్టు టీమ్ గురువారం సందర్శించింది. ఈ సందర్భంగా సబ్ సెంటర్‌లో అందిస్తున్న వైద్య సేవలను ఇంచార్జ్ ఎస్ఒ ఎస్ శంకర్రావు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత నివారణ చర్యలు చేపట్టాలన్నారు. శిశుమరణాల రేటు తగ్గించే విధంగా గ్రామాలలో అందిస్తున్న వైద్య సేవలను అన్ని రికార్డులో పొందుపరిచి వాళ్లకు తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి వివరించారు. ప్రతి రికార్డు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిపిఎ ఉషారాణి, డిపిఒ లీలారాణి, డేటా ఆపరేటర్ ప్రతిభ, హెచ్‌వి వరలక్ష్మి, ఏఎన్ఎంలు, ఎంఎల్ ఆశలు పాల్గొన్నారు



రికార్డులు పరిశీలిస్తున్న బృంద సభ్యులు

## శతశాతం ఇంటి పన్ను వసూలు చేయాలి

ప్రజాశక్తి- సీతంపేట

ఇంటి పన్ను శతశాతం వసూలు చేయాలని డిపిఒ సత్యనారాయణ అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో కార్యదర్శిలతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి పన్ను ప్రతి పంచాయతీలో వందశాతం లక్ష్యాలు పూర్తి కావాలన్నారు. గ్రామ పంచాయతీ అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని చెప్పారు. చెత్త సంపద కేంద్రాలపై దృష్టి సారించాలని చెప్పారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ కే గీతాంజలి, మండల విస్తరనాధికారి కొండపల్లి సత్యం, ఎఒ, కార్యదర్శులు సుదర్శన్ రావు, పాపారావు, వినోద్, శ్యామ్, కామేశ్వరరావు, శివాజీ, అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.

## హాస్టల్ విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు



ఆరోగ్య పరీక్షలను పరిశీలిస్తున్న జగన్మోహన్‌రావు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

మండలంలోని రావికోన గిరిజన సంక్షేమ ఆశ్రమ వసతిగృహా(హాస్టల్)న్ని జిల్లా మలేరియా అధికారి(డిఎంఒ) డాక్టర్ టి.జగన్ మోహనరావు గురువారం సందర్శించారు. విద్యార్థుల సిక్ రిజిష్టర్‌ను తనిఖీ చేసి ఇటీవల కాలంలో జ్వర లక్షణాలతో నమోదైన వారి వివరాలు, నిర్ధారణ పరీక్షలు, వాటి నివేదికలు పరిశీలించారు. ఇతర ఆరోగ్య సమస్యలతో నమోదైన వివరాలు, ఎక్కడ చికిత్స ఇస్తున్నారు, అందుకు సంబంధించిన ఓపి స్లిప్‌లు పరిశీలించారు. సిక్ రూంలో విద్యార్థులతో ఆయన మాట్లాడి వారి ఆరోగ్య పరిశీలన చేశారు. జ్వర లక్షణాలున్న విద్యార్థికి వైద్య సిబ్బందిచే నిర్ధారణ పరీక్ష చేయించారు. ప్రతి రోజూ ఆరోగ్య పర్యవేక్షణ చేయాలని, వైద్య సిబ్బంది ఇచ్చిన మందులను దగ్గరుండి వేయించాలని హాస్టల్ నిర్వాహకులకు సూచించారు. విద్యార్థులకు ఏ ఆరోగ్య సమస్య వచ్చినా వైద్య సిబ్బందికి వెంటనే తెలియజేయాలన్నారు. విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. క్షేత్ర స్థాయి వైద్య సిబ్బంది ఎప్పటికపుడు హాస్టళ్లను సందర్శించి విద్యార్థులకు ఆరోగ్య తనిఖీలు చేపట్టాలన్నారు. అనంతరం ఆయన వంటగది, హాస్టల్ పరిసరాలు పరిశీలించి వాడుక నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, తద్వారా దోమల ప్రభావం ఉండదని అన్నారు. డార్మేటరీ కిటికీలకు మెస్‌ల స్థితిని పరిశీలించారు. కార్యక్రమంలో ఎఎంఒ సూర్యనారాయణ, హెచ్ఎం కె.సిమ్మన్నదొర, వార్డెన్ నరసింహులు, హెల్త్ అసిస్టెంట్ బంగారునాయుడు తదితరులు ఉన్నారు.



డ్రై ఫ్రూట్స్‌ను అందిస్తున్న నిర్వాహకులు

## పిల్లలకు డ్రై ఫ్రూట్స్ పంపిణీ

ప్రజాశక్తి - వీరఘట్టం

మండల కేంద్రంలోని రెగ్యులర్ పాఠశాలలో గురువారం పాలకొండలోనే శాలెం ప్రార్థన మందిరానికి చెందిన చక్రవర్తి, వికలాంగ పిల్లలకు డ్రై ఫ్రూట్స్ పంపిణీ చేశారు. పట్నంలోని వికలాంగులు ఉన్న ప్రతి ఇంటికి వెళ్లి డ్రై ఫ్రూట్స్ పంపిణీ చేశారు. పాఠశాల విద్యార్థులకు కూడా అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు డి. నారాయణరావు, సహిత ఉపాధ్యాయులు ఆర్ రాంబాబు, ఉపాధ్యాయులు ఎన్‌వి భాస్కర రావు, బాబురావు, విద్యార్థులు పాల్గొన్నారు

## నిబంధనలతో ప్రభుత్వ విద్య నిర్వీర్యం : యుటిఎఫ్

ప్రజాశక్తి - సీతానగరం

ప్రాథమిక విద్యావ్యవస్థలో చిన్నారులు ఒకటో తరగతిలో చేరాలంటే ఆరేళ్ల వయసు ఉండాలని కేంద్రం తీసుకొచ్చిన నిబంధనతో ప్రభుత్వ పాఠశాలలు నిర్వీర్యమవు తాయని, నిబంధనలను వెంటనే సవరించాలని యుటిఎఫ్ మండల శాఖ డిమాండ్ చేసింది. స్థానిక ఎమ్మార్సీ ఆవరణలో మండల శాఖ ఒక ప్రకటన విడుదల చేస్తూ కేంద్ర ప్రభుత్వ ఆదేశాలను అమలుకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్సాహం చూపుతుందని విమర్శించారు. నూతన విద్యా విధానంలో భాగమైన ప్రాథమిక పాఠశాలలను ఉన్నత పాఠశాల్లో విలీనం మొదలగు అంశాలతో ఇప్పటికే నిర్వీర్యమైన ప్రాథమిక పాఠశాల విద్యా వ్యవస్థ ఈ నిబంధనలతో పాఠశాలలు పూర్తిగా మూతపడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ నిబంధన ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేసింది. ఈ నిబంధనతో ప్రైవేటు పాఠశాలలకు లబ్ధి చేకూరుతుందని ప్రభుత్వ పాఠశాలలు పూర్తిగా మూతపడే పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి.శ్రీనివాసరావు, బి.ప్రసాదరావు, గౌరవాధ్యక్షులు టి.మధుసూదనరావు, జిల్లా కార్యవర్గసభ్యులు ఎం. గోవిందరావు, మండల కార్యవర్గ సభ్యులు బి.ఆదినారాయణ, కె.మురళి పాల్గొన్నారు.

## టిడిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి-విజయనగరం కోట

నగరంలోని 5వ , 7వ డివిజన్ లకు చెందిన గువ్వల ప్రసాద్, కోండ్రు శంకరరావు, చిప్పాడ శ్రీను, నామాల ఎల్లాజీ, కనకల గోవింద్, దువ్వు శేఖర్, ఒమ్మి లక్ష్మణరావుతో పాటు 35 కుటుంబాలు గురువారం టిడిపిలో చేరాయి. నియోజకవర్గ ఇన్‌ఛార్జి పి.అదితి విజయలక్ష్మి వారందరికీ పార్టీ కండవాలు వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, మండల పార్టీ అధ్యక్షులు బొద్దల నర్సింగరావు పాల్గొన్నారు.



కార్యకర్తలతో మాట్లాడుతున్న విజయ్ చంద్ర

## టిడిపి గెలుపునకు కృషి

ప్రజాశక్తి- సీతానగరం

పార్వతీపురంలో టిడిపి గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని టిడిపి నియోజకవర్గ ఇంఛార్జి బోనెల విజయ్ చంద్ర అన్నారు. మండలంలోని లక్ష్మీపురంలో ఆయన గురువారం కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో టిడిపి జెండా ఎగురువేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కార్యదర్శి రౌతు వేణుగోపాలనాయుడు, మండల నాయకులు రెడ్డి సింహాచలం నాయుడు, దయానిధి పురం సర్పంచ్ చింటూ రామారావు, వాకాడ పారినాయుడు తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యత కరువు

ప్రజాశక్తి - వీరఘట్టం

పునాది గట్టిగా ఉంటే గోడలు కూడా దృఢంగా ఉంటాయి. అదే నాణ్యత కరువైతే ఎన్ని భవనాలు కట్టినా ప్రయోజనం శూన్యం. ఇలాంటి పరిస్థితే మండల కేంద్రంలో చేపట్టిన మెయిన్‌రోడ్డు పనులు. వీరఘట్టంలోని వట్టిగెడ్డ వంతెన నుండి స్వామి థియేటర్ వరకు సుమారు 1.2 కిలోమీటర్ల దూరంలో రూ.5.5 కోట్లతో ఉపాధి హామీ చట్టం ద్వారా ప్రధాన రహదారి విస్తీర్ణ అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. ఈ పనుల్లో భాగంగా రహదారికి మధ్యలో డివైడర్లు ఏర్పాటు చేశారు. వీటి నిర్మాణ పనులు చేపట్టినప్పటి నుంచి తడిపే



బీటలు వారిన డివైడర్

దాఖలాల్లేకపోవడంతో ఎండన బారిన పడి డివైడర్లు బీటలు వారి దర్శనమిచ్చాయి. అలాగే నాణ్యతా ప్రమాణం ఏ విధంగా ఉందో వీటిని చూస్తేనే అర్థం చేసుకోవచ్చు. పనులు జరిగినపుడు అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో గుత్తేదారిచ్చే కాసులకు కక్కుర్తి పడితే పనులు ఇలాగే ఉంటాయని స్థానికులు విమర్శలు గుప్పిస్తున్నారు.